# సజీవులు

"మాది గుంటూరు జిల్లాలే. మీ నైజాం జనం రిక్షాబళ్ళు లాక్కొంటూ యీడ శానామంది అగుపిస్తావుంటార్లే" అన్నాడు రంగయ్య.

"కష్టం చేసుకుంటానికి ఎక్కడయితేనేంలే" అన్నాడు రాములు.

"అంతేలే" అన్నాడు రంగయ్య.

రిక్షాదీపంతో బీడి ముట్టిచ్చి దీపం ఆరిపేశాడు రాములు.

"ఇంకో ముక్కేమన్నావుండాదా" అనడిగాడు రంగయ్య.

"లేదే, సిన్నముక్క ఎప్పుద్దో బొడ్డో వుంటే ఎలిగించికుండా" అన్నాడు రాములు.

"చలిగా వుండదే, యట్టనబ్బా! యీ నిశిరేత్రి బీడీముక్క యేడ దొరుకుద్దీ?" అన్నాడు రంగయ్య వొళ్ళంతా వొక్కసారి చలిబుట్టినట్టు. బీడీదమ్ము గుండెల్దాకా ఎగబీకుతున్నాడు రాములు. రాముల్ని ఓ చూపుచూసి, గబిక్కినలేచి చుట్టుపక్కల ఏందో పోయినట్టు ఎతకటం మొదలుపెట్టాడు రంగయ్య.

"ఏంది నువు ఎతికేదీ?" అన్నాడు రాములు రంగయ్య నాటకం కనిపెడ్తూ.

"ఆఁ ఏంలేదులే. యిందాక ఓ సిన్నముక్క యీడ పారేశాలే–" అన్నాడు రంగయ్య యినీ యినపడకుండా, ఆడ కెలుకుతూ.

"ఇదిగో అన్నోవ్' పురుగూ గిరుగూ వుంటది, ఆడ యిప్పుడేం ఎతుకుతావుగానీ యింకాత్తె వుండది అటనే ఓ దమ్ము పీకుదువుగాని రా" అన్నాడు రాములు.

"ఆఁ, ఎందుకులే–" అన్నాడు రంగయ్య ఎతకటం ఆపుతూ.

"ఎందుకులే ఏంది! ఎవరికయినా కుతిగా వుంటదిలే రా, రా" అన్నాడు రాములు.

"ఆఁ, ఆకాస్త ముక్కలో దానాదర్మం దేనికిలే–" అన్నాడు రంగయ్య రాములు దగ్గిరకొస్తూ.

"ఓస్ దీనికేనా – యిఁద – అట్టనే రెండు దమ్ములు పీకుతే సరిపోయె" అన్నాడు రాములు బీడీముక్క రంగయ్యకు అందిస్తూ.

బీడీ ముక్క చివరికొన కాత్తె తుంపి చెమ్మను పై పంచకు అద్ది, గుక్కబట్టి నంత దమ్ము ఒకటే ఒకటి పీకాడు రంగయ్య, నరనరాలు పెటమట మంటూంటే.

"గాటు వుండదా." అనడిగాడు రాములు ఒక్క క్షణం రంగయ్యను మనసుబుట్టేట్టు చూస్తూ.

"అబ్బో చాల్చాలు!" అన్నాడు రంగయ్య దమ్ముదెబ్బ తట్టుకుంటూ.

"ఏయ్ రిక్షా?" అని టఫీమని చీకట్లో పిడుగుపడ్డట్టు యినిపించింది యాడో గొంతు రంగయ్యా, రాములకు.

పందెం వేసినట్టు బర్న చెక్రాల్దిప్పి ఆ గొంతరుపుకు సూటిగా తాడేసి లాగినట్టు యిసురుగా రిక్షాబళ్ళు లాగేసుకెళ్ళారు రంగయ్యా, రాములు.

"స్టేషను కెంత?" అన్నాడా కోటేసుకుని రోడ్డు మీద నిలబడిన మనిషి.

"పావలా" అన్నాడు రాములు రొప్పుతూ.

"మూడణాలు" అన్నాడు రంగయ్య రొప్పుతూ.

"ఒక్క రిక్షా చాలు" అన్నాడా మనిషి చీదరిచ్చుకుంటూ.

"ఎల్దాం ఎక్కండి" అన్నాడు రంగయ్య సీటు దులుపుతూ.

"ముంగల నే నడగలేదండీ అయ్యగారూ?" అన్నాడు రాములు రంగయ్య కళ్ళె చూస్తూ.

"మూడణాలు యిప్పియ్యమని ముందల నేనుగదండీ అడిగింది అయ్యగారూ." అన్నాడు రంగయ్య రాములు వేపు చురచురచూస్తూ.

"చాల్లేవోయ్" అన్నాడు రాములు రంగయ్యని.

"నువు చాల్లేవోయ్" అన్నాడు రంగయ్య రాముల్ని.

"పళ్ళూడ్తయి" అన్నాడు రాములు రంగయ్యని.

"మళ్లీవూడ్తయి నైజాంఎళ్లేదాకా" అన్నాడు రంగయ్య, రాముల్ని.

"నేనెందుకెల్తారా, నువే ఎళ్లు మీ గుంటూరు గింటూరు" అన్నాడు రాములు రంగయ్యని.

"ఏయ్ దున్నపోతులు" అనరిచాడు కోటు మనిషి.

ఎంటనే ఏళ మిగిలిపోయిందంటూ పక్క బజార్లోంచి రెండు రిక్షాబళ్లు గబ గబ వొచ్చి కోటుమనిషీ, రంగయ్యా, రాములు పక్కన వాల్నయ్.

"ఎళ్లిపోదాం ఎక్కండి అయ్యగారూ" అన్నాడు కొత్తగా వొచ్చిన వొక రిక్షాబండి మనిషి.

"ఏయ్ నీవు రావోయ్ - పశువులు-" అని చీదరిచ్చుకుంటూ మొహాన కొట్టినట్టు కొత్తగా వొచ్చిన రెండో రిక్షా బండెక్కి వెళ్ళిపొయ్యాడు కోటు మనిషి.

"యదవా" అన్నాడు రంగయ్య రాముల్నీ.

"పోరా అక్కుపచ్చీ" అన్నాడు రాములు రంగయ్యని.

"చాల్లే వుండండోయ్ అంతా అయిపోయినాక సాగిచ్చారుగానీ. మద్దె ఆడెవుడో బాడిగకాత్తా ఎగదన్నుకుపోతే యింకా ఏందంట మీరు బాస మాట్టాదేది?" అన్నాడు కొత్త రిక్షా మనిషి.

"నువు ఎవురియ్యోవ్ ఇబీసుడికి మల్లే వొచ్చావ్" అన్నాడు రంగయ్య కొత్త రిక్షా మనిషిని.

"ఆ, యీయన అంతకన్న నాలుగాకులు ఎక్కువే సదివాడు" అన్నాడు రాములు రంగయ్యని.

"చాల్లేవోయ్" అన్నాడు రంగయ్య కొత్త రిక్షా మనిషిని.

"ఒచ్చిందార్నే ఎళ్ళు" అన్నాడు రాములు కొత్త రిక్షా మనిషిని.

"ఏయ్, ఎవరక్కద?" అనరిచాడో మనిషి రోడ్డు మయాన టక్ టక్ టక్ మంటూ బూడుసులు కొట్టుకుంటూ వొస్తూ.

"అమ్మ పోలీసాడు-" అన్నాడు కొత్త రిక్షా మనిషి.

"ఆడె - ఆడె-" అన్నాడు రాములు.

"ఎహె ఆతలికి పదండి దబ్బున-" అన్నాడు రంగయ్య గబిక్కిన రిక్షాని చెట్టేపుకు తిప్పుకెళ్తూ.

"అటుగా ఎల్లవయ్యానువు ఎవరివో గానీ-" అంటూ తనూ రావిచెట్టు కిందకి రిక్షా మళ్ళించాడు రాములు.

"నాపేరు రెడ్డమ్మలే- పదండి నేనూ వొస్తా మీతోనే-" అంటూ తనూ రావిచెట్టు కిందకి దారితీశాడు రెడ్డమ్మ.

టక్ టక్ మనుకుంటూ వొచ్చి, రావిచెట్టు కిందకి చేరి చడీ చప్పుడు కాకుండా కూచున్న రిక్షా మనుషుల్ని ఓ చూపుచూసి, అటనే టక్ టక్ మనుకుంటా ఎటుగానో వెళ్లిపోయ్యాడు పోలీసాయన.

"నువు ఎందుకయ్యా రాములయ్యా నాబాడుక్కి అడ్డాం తగలిందీ." అనడిగాడు రంగయ్య బూడుసుల చప్పుడు అయిపొయ్యేతలికి.

"అది నీ బాడుగా? చాల్చాలై! నీ కక్కుర్తికొద్ది నువు లగెత్తుతే నా కక్కుర్తికొద్దీ నేనూ లగెత్తా. అసలా పెద్దమనిషిని మనిద్దరికి కాకుండా మద్దెన ఎందుకొచ్చాడో అడగవేం?" అన్నాడు రాములు రంగయ్యని.

"మళ్లీ అదేమాటా! యింకోడెవుడో వూరూపేరూ లేనివాడు బాడిగ ఎగదన్నుకుపోతే నామీన పడ్డారేందీ? మీకుమల్లే కక్కుర్తికి నేనూ లగెత్తుకొస్తిని - ఏం సారదకం?" అన్నాడు రెడ్డమ్మ.

"నీదేవూరేం?" అడిగాడు రంగయ్య రెడ్డమ్మని.

"కడపజిల్లాయే అనుకో - ఏమంట అయితే?" అన్నాడు రెడ్డమ్మ.

"ఓయబ్బో! మరి అంత దూరాన్నుంచి యీడేంవుందని పీక్కుదిందామనొచ్చా?" అన్నాడు రంగయ్య రెడ్డమ్మని.

"ఆడ కరువు పుట్టిందంటలే ఈ మద్దెన యీడేదో మనం పీక్కుతింటున్నామని యింత లెక్కావొచ్చిపడె!" అన్నాడు రాములు.

"మీదేవూరేం?" అనడిగాడు రెడ్డమ్మ రాముల్ని.

"మంది నైజాంలే" అన్నాడు రంగయ్య శాన్సు దొరికిందనుకుంటూ.

"ఏందీ! అయితే చరేలే! ఎనక ఎపుడో తన ముడ్డికింద నీలు బెట్టుకుని యింకోడి ముడ్డికింద నీలున్నయ్యన్నాడంట! మరి నైజాం నుంచి పడ్తూ లేస్తూ ఆయనెందుకొచ్చాడో చెప్పాడు గాదేం" అన్నాడు రెడ్డమ్మ.

"అట్టడిగావు బాగుంది!" అన్నాడు రంగయ్య.

"సరే, కడుపు కక్కుర్తికే ననుకోరాదూ" అన్నాడు రాములు కాత్తె నిదానంగా.

"యిహ, యిహ్, యిహ్ - ఎనక ఎవరో శాత్రం చెప్పాడంటాలే. 'తనకు దూర కంత లేదు. తన మెడకో డోలంట' అని. మొదులు యీడ మా బతుకు 'ఎండకు ఎండక, వానకు తడవక' అన్నట్టు ఎల్లబార్తుండదీ ఈ రేందో మాపక్క కొచ్చి వాల్తుంటారు; బాగుంది రెడ్డమ్మయితే కరువంటున్నాడు. మరి నైజాంలో నీకేంవుందయ్యా రాములయ్యా? ఆడ నవాబుగారుండారుగా." అన్నాడు రంగయ్య.

"ఆ వుండాడు! రావణాబెమ్మకన్న ముదనష్టపోడనుకో. మేము మా బూమి దున్నుకుని సుమారుగా బతుకుతుంటే మమ్మల్ని సరీగా బతకనిచ్చారా? మా సుట్టూతా

సానామంది శెనిగాళ్లున్నారు. అసలే అప్పుల్తో, పన్నుల బరువుతో మేం చత్తుంటే పిల్లి సమత్తాడిందని, ఎలిక బుట్టిందని యీ శెనిగాళ్లకి డబ్బు గావాల్సొచ్చినప్పుడల్లా పోలీసుల్ని దెచ్చి బెదిరించి ఏదుంటే అది లాక్కుబోయేవాళ్లు. ఓనాడు ఏంది యీ అన్యాయమని ఎదురు తిరిగి అడిగితే మా అయ్యని, మా అమ్మని, మా అన్నదమ్ముల్ని పక్కలిరగదన్ని పైగా మేం ఆళ్లని తన్నినట్టు మా మీద తప్పుడు కేసులు పెట్టి మా పొలం కాజేశారు. పెద్దన్నోవేపూ, సిన్నతమ్ముడోవేపూ, అయ్యా అమ్మలోవేపూ పోతే నేనిటుగా వొచ్చా" అన్నాడు రాములు.

"ఒచ్చావు బాగానేవుందిగాని మరి యీడేం వుండది నాబూద్దా! ఏందో 'దూరపు కొండలు నునుపంట!" అన్నాడు రంగయ్య.

"అంత తేలిగ్గా అనబోకు రంగయ్యోవ్. నువేగనక మా నైజాంలో ఒక్కరోజుండొస్తే యీడ రిక్షా లాక్కుంటం నీకు సొరగంగా వుంటది. ఓపూట తిన్నా, తినకబోయినా యీడ నాకు పప్పూ కూరా అగుపిస్తున్నది" అన్నాడు రాములు.

"రాములన్నది సత్తెంగా నిజం రంగయ్యా, మా కడపజిల్లాలో ఇన్నంటే యిన్ని నీలకు కరువాసిపోయి పంటలు పండక సింతపిక్కల గంజే తాగామో, ఆకులే తిన్నామో, బురదనీరే తాగామో యాడన్నా యినుంటావేమో గాని కంటితో చూసుండవు. యీడకొచ్చినాక ఒక్కపూట యింత తిన్నా మాకు పండగ చేసుకుంటున్నట్టుగా వున్నదంటే నమ్ము" అన్నాడు రెడ్డమ్మ.

"సరే మీ గోడు మీదే. ఎనక ఓ శాత్రం వున్నదిలే. చచ్చినాడి కన్న సొరగాని కెళ్లినోడు గొప్పోడంట! అట్టా వుంది మీరు సెప్పేది.

"యిక్కడ యవసాయం నేనూ ఎలగబెట్టా కొన్నాళ్ళు. మా పొలం బంగారప్పొలమని పెతోరూ అంటారు అంటానికి. అయితే ఏం మా వూరికి పక్కనే ఓ ఏరు వుంది. పెతేటా ఏరు పొంగనూ పంట పాడుగానూ, పొంగనూ, పాడుగానూ! నువేమో వానల్లేక కరువొచ్చిందంటివి, మరి వానలు గురిసి సెడిన నా సంగతేమంటా? చేతికొచ్చే పంటేమో రాకబోయె. అప్పేమో పెరిగిపోతుండె, పొలమేమో ఏటేటకు దిబ్బేసిపోతుంటే మెరక తియను వల్లగాకబోతుండె – మరి యింకేందమ్మా నువు చేసేది? చేసిన అప్పుకు పొలం సరిపోంగా మావూళ్ళో మొగం చెల్లక ఓ నిశిరేత్రి పెళ్ళాంబిడ్డల్తో యీడకు చేరుకున్నా. నత్తగుల్లలొక సోట నవరత్నాలొకసోటంట! అట్టాగే పెట్టిపుట్టినోరు ఏరే వుంటారు. నువూ నేనూ ఎంత కష్టపడ్డా ఏం సొరదకం? ఎండా వానని తెలవకుండా అంత బరువేసుకుని యీ రిక్షాబండితో తెల్లార్లూ లగెత్తినా నీకు ముప్పూటా తిండి

దొరుకుతున్నదా? యిదిగో రెడ్డెమ్మోవ్, మీ జిల్లాలో చింతగింజల గంజినీలు తాగినా ఈడ సగం కడుపుకు తిన్నా తేడా ఎక్కువేం లేదులే" అన్నాడు రంగయ్య.

"అయితే నువంటం, సగం వంతు తిన్నా, పాతికవంతు తిన్నా తేడా ఏం లేదంటావు; నేను తేడా వున్నదంటా" అన్నాడు రెడ్డెమ్మ.

"నేనూ అంతేనంటా" అన్నాడు రాములు.

"అనుకోండి. మారాజుగా అనుకోండి. మిమ్మల్ని కాదంటానికి ఎవరికేం రైటు లేదు. ఆడేంది అప్పుడే ఒంటి గంట కొడ్తున్నారే!" అన్నాడు రంగయ్య గంట కొట్టడం వింటూ.

"అప్పుడే ఒగ్గంట కొట్టారా? ఏంది అప్పుడే తెల్లార్తుందదే! యింతమట్టుకి బాడిగేదీ?" అన్నాడు రాములు.

"తెల్లార్తుండ కొద్దీ మనుషులు అసలు లెగవరే! తెల్లార్తే రిక్షా అద్దె కట్టుకోను నాకాడున్నది సాలదే ఎట్టనబ్బా? యిగ నాల్గుగంటలకి టేసనికాడే ఏమన్నా బాడిగ దొరుకుతే" అన్నాడు రెడ్డమ్మ.

"ఆ మెయిలుబండి రెండు గంటలు లేటుగా వొచ్చుద్ది. ముందొస్తిగా ఆడకు పోయి కూచుంటే యీడేమన్నా బాడిగపోతే? సినీమాకాడ యియాల నాకు బేడ్డబ్బులే గిట్టుబాటయినై. నీకేమన్నా గిట్టుమాటయిందా రంగయ్యా" అన్నాడు రాములు.

"అందరూ సినీమాకాడికి పోతే ఈడ ఎపుడేం వుండదని కూకుంటే అసలుకు మోసం వొచ్చిందే!" అన్నాడు రంగయ్య.

"యియాళ నా పనీ అంతే అయింది రంగయ్యన్నా. అప్పటికీ ఓ చోట కూచోకుండా బజార్లన్నీ తిరుగుతానే వుండా" అన్నాడు రెడ్డమ్మ.

"టేసని కాడేమన్నా దొరక్కుండా వుండదిగా?" అన్నాడు రాములు.

"ఆ, యిగ అంతేననుకోవాల్సిందే ఆడకు అదీ ఇంతే అయితే యిగ సప్పగా పడుకోవచ్చు. తెల్లార్తుండదీ! యాడున్నావే గొంగళా 'అంటే' ఏసినచోటే వున్నా' నన్నదంట! ఓ బీడీ ముక్కుంటే సూడు రెడ్డమ్మా!" అన్నాడు రంగయ్య.

"ఏదీ, లేదే యిందాకటినుంచి నేనే అడుగుదామనుకొంటా నోరుజారక వూరుకున్నా. నీ దగ్గిరేమన్నా వుంటే చూడు రాములయ్యా!" అన్నాడు రెడ్డెమ్మ.

"చరేలే! నా సంగతి రంగయ్య నడుగు తెలుసుద్ది - ఎవరా గోడకాడా చూడు

చూడు ఎవురో ఆ గోడకాడ ఏందో చేస్తున్నాడు" అన్నాడు రాములు సత్రం గోడకల్లి వేలుపెట్టి చూపిస్తూ.

"ఆc, ఏందో గోడమీద సద్దుతుండాడు - కన్నం ఎయటానికి కాదు గందా-" అన్నాడు రెడ్డెమ్మ నిటారుగా కూచుంటూ.

"ఎహె ఏవూరో కంపిణీ మనిషిలే - గోడమీన ఏదో రాస్తుండాడు ఓ ఎవురయ్యోవ్ నువూ ఆడ ఏందో చేస్తుండావూ?" అనడిగాడు రంగయ్య గోడ దగ్గిర మనిషిని.

"ఆంధ్రరాష్ట్రం-ఆంధ్రరాష్ట్రం!" అన్నాడామనిషి చప్పున అంతుబట్టనట్టు.

"ఏందది?" అన్నాడు రెడ్డెమ్మ.

"ఏందో కంపిణీ అయ్యుంటది" అన్నాడు రాములు.

"ఎహెవుండండి - ఆ మనిషి ఆంధ్ర రాష్ట్ర మంటుంటే!" అన్నాడు రంగయ్య.

"ఏంది ఆంధ్రరాష్ట్రమా?" అన్నాడు రాములు నోరుదెరిసి.

"అదిగదీ దెబ్బ!" అన్నాడు రెడ్డెమ్మ చిటికేస్తా.

"మీటింగేమన్నా వున్నదంటయ్యా?" అనడిగాడు రంగయ్య.

"మీటింగులకేంలే ముందర ఆంధ్ర రాష్ట్రం తెమ్మంటుంటే!" అన్నాడు గోడ దగ్గిర మనిషి.

"ఏంటి అంటున్నాడూ?" అనడిగాడు రెడ్డెమ్మ రాముల్ని.

"ఆంధ్రరాష్ట్రం వచ్చుద్దంట!" అన్నాడు రాములు.

"ఒచ్చుద్దని అన్లేదులే - తెమ్మంటున్నారంట!" అన్నాడు రంగయ్య.

"ఎవురూ తెమ్మంటున్నదీ?" అనడిగాడు రెడ్డెమ్మ.

"మన తెలుగోళ్లేనా?" అనడిగాడు రాములు.

"కాకపోతే యింకెవ రంటారనుకున్నా?" అన్నాడు రంగయ్య.

"అహాc, నాకు తెలవక అడుగుతా గానీ యీ యిషయంలో మన తెలుగారిలో తెలుగారికి మాటమాట కలవటంలేదంట నిజమేనా?" అడిగాడు రెడ్డెమ్మ.

"ఎహె మొన్న మీటింగులో పెద్దలడాయేసుకుంటేనూ! కాకమీన పొడుసుకుని కోర్టుకెక్కుతారేమో ననుకుండా!" అన్నాడు, రాములు.

"యిషయం అటువంటిదైతే వూరకనే అరుచుకుంటారుగానీ మనోళ్లు నిజంగా పొడుచుకుంటారయ్యా రాములయ్యా?" అన్నాడు రంగయ్య.

"అయితే అదంతా మంచికేనంటావు?" అనడిగాడు రాములు.

"మరి రాష్ట్రం తెమ్మంటున్నారంటుంటే వూరకనే ఎట్టంటారు?"

"వూరకనే ఎందుకనాలంట, కాత్తె గెట్టిగానే అనాల అనేమాటేదో! ఇదిగో నయ్యోవ్? నువు ఎవురోగానీ అచ్చిరాలు కాత్తె గట్టిగా రాయి" అన్నాడు. రంగయ్య లేచి గోడ దగ్గిర మనిషి పక్కకు వెళ్తూ.

"తెమ్మనమని రాస్తున్నావు నిజమే గానీ మరి ఆ యిచ్చే ఆయన ఎనక్కిలాగితే?" అన్నాడు రెడ్డెమ్మ రంగయ్య ఎనకమాలే గోడ దగ్గర మనిషి పక్కకి వెళ్తూ.

"ఎవర్నన్నాయియమంటే మళ్లీ పేసీలొత్తయ్యేమో?" అన్నాడు రాములు రెడ్డెమ్మ ఎనకమాలే వెళుతూ.

"యీసారి ఎవరు యిచ్చినాయివ్వకబోయినా ఆంధ్ర రాష్ట్రం మనకు వొచ్చి తీరాల్సిందే!" అన్నాడు గోడ దగ్గిర మనిషి పెద్ద పెద్ద అచ్చరాలు గోడమీద రాస్తూ.

"ఎవురుకోసం రాదంటా 'జై' మనంటే?" అన్నాడు రెడ్డెమ్మ.

"ఎహె 'జై' య్యనండీ ఆనక చూద్దాం!" అన్నాడు రంగయ్య.

"ఆంధ్ర రాష్ట్రానికీ-!" అరిచాడు గోడ దగ్గిర మనిషి వూపు మీద చెయ్యిత్తి.

"జై!" అనరిచారు రంగయ్య, రాములు, రెడ్డెమ్మలు రావిచెట్టు మీద నిదరపోతున్న కాకులు గొల్లుమని లేచేట్టు.